ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
గురువారం 2 అక్టోబరు 2025 | 7





నమో వేంకటేశాయ!





- రాజమండ్రి- తిరుపతి విమాన సర్వీసు ప్రారంభం
- వర్చువల్ ద్వారా న్యూఢిల్లీ నుంచి ప్రారంభించిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ పురందేశ్వరి 10
- మధురపూడిలో తొలి సర్వీస్ ప్రారంభించిన మంత్రి దుర్గేష్
- తొలి మూడునెలలపాటు టిక్కెట్ ధర రూ.1999, రూ.4,000

నూతన విమాన సర్వీసును జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు

మహిషాసురమర్దినిగా.. బాలాత్రిపురసుందరి అమ్మవారు

కాకినాడసిటీ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో పదోరోజైన బుధవారం కాకినాడ సూర్యారావుపేటలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో బాలాత్రిపురసుందరి అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నవావరణార్చన, చండీ హోమం జరిపారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జీ, సభ్యులు, ఈవో వుండవల్లి వీర్రాజుచౌదరి ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాయంత్రం అన్నమాచార్య కీర్తనలు, కూచిపూడి నృత్యం, కోలాటం ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

మహిషాసురమర్దిని అలంకరణలో దర్శనమిస్తున్న కాకినాడలోని బాలాత్రిపురసుందరి అమ్మవారు



మహిషాసుర మర్దినిగా రత్నగిరి దుర్గలు

అన్నవరం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రత్నగిరి దుర్గలుగా పూజలందుకుంటున్న వనదుర్గ, కనకదుర్గలు మహర్నవమిని పురస్కరించుకుని బుధవారం మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా దేవస్థానం చైర్మన్ రోహిత్ పాల్గొన్నారు.

క్షణికావేశం

- రెండు నిండు ప్రాణాలు బలి
- ఒక హత్య, మరొకరి ఆత్మహత్య
- సామర్లకోటలో ఘోరం

సామర్లకోట మండలం పనసపాడు శివారు కాలువ గట్టు వద్ద 17 ఏళ్ల బాలిక దారుణంగా హత్యకు గురైంది. ఇదే సంఘటనకు సంబంధించి మరో 19 ఏళ్ల యువకుడు వేట్లపాలెం గ్రామ శివారు గూడపర్తి రైలు పట్టాల కింద తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ రెండు సంఘటనలు బుధవారం సామర్లకోట మండలంలోని రెండు వేర్వేరు గ్రామాల్లో జరిగినా మృతులిద్దరిదీ దుర్గాడ గ్రామానికి చెందిన వారిగా నిర్ధారించారు. దీనికి వీరిద్దరి మధ్య రెండేళ్లుగా కొనసాగుతున్న ప్రేమ వ్యవహారమేనని పోలీసులు భావిస్తున్నారు.

(పూర్తి వివరాలు మెయిన్‌లో)

మార్కెట్‌లో

దసరా సందడి



- జీఎస్టీ శ్లాబుల కుదింపుతో తగ్గిన ధరలు
- ఊపందుకున్న వ్యాపారాలు
- పండగ ఆఫర్లతో పెరిగిన వాహనాల కొనుగోళ్లు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

తెలుగు పండగల్లో ముఖ్యమైన విజయదశమికి ఊరూవాడా ముస్తాబైంది. దసరా శరన్నవరాత్ర ఉత్సవాల్లో పదిరోజులుగా గ్రామగ్రామాన ఆధ్యాత్మిక సందడి నెలకొంది. దుర్గమ్మకు నిత్యం పూజలు చేస్తూ ఆరాధిస్తున్నారు. జిల్లాలోని ప్రముఖ అమ్మవార్ల ఆలయాలతో పాటు చిన్నచిన్న ఆలయాలు సైతం దుర్గమ్మ నామస్మరణతో మార్మోగుతున్నాయి.

దసరా వస్తోందంటే చాలు సరదా మొదలవుతుంది. ఓ పక్క ఆధ్యాత్మిక సంబరాలతోపాటు చిన్నారులు ఆట పాటలతో సందడి చేస్తారు. పది, పదిహేను రోజులపాటు ఈ వాతావరణం ఉంటుంది. పిల్లలు ఉత్సాహంగా ఉంటే.. పెద్దలు, మహిళలు భక్తిభావంతో ఆలయాలను సందర్శిస్తూ ప్రత్యేక పూజలు చేస్తూ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలుస్తారు.

వస్త్ర, వాహన కొనుగోళ్లు..

దసరాల్లో మరో ప్రధాన ఘట్టం వస్త్ర, వాహన కొనుగోళ్లు. జిల్లాలో పండగ వేళ వివిధ వ్యాపార మార్కెట్లలో సందడి నెలకొంది. ముఖ్యంగా జీఎస్టీ శ్లాబులను కుదించి కొత్త సంస్కరణలు తీసుకురావడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. దీనికితోడు పండగ సందర్భంగా వివిధ షోరూమ్‌లు, షాపింగ్ మాల్స్ భారీ డిస్కౌంట్లతో ప్రత్యేక ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. దీంతో కొత్త వస్త్రాలు, వాహనాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. ఆయా మార్కెట్లలో పండగ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మొన్నటివరకు 5, 12, 18, 28శాతం పన్ను శ్లాబ్‌లు అమలులో ఉండగా తాజా సంస్కరణలతో 5, 18శాతం వరకు ఒకటి, 40శాతం వరకు రెండో శ్లాబ్‌గా అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో కార్లు, టీవీలు, బైక్‌లు, కుక్కర్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు తగ్గుముఖం పట్టడంతో వాటి అమ్మకాలు జోరందుకున్నాయి.

తగ్గిన శ్లాబ్‌లతో..

జీఎస్టీ కొత్త శ్లాబ్‌లు అమల్లోకి రావడంతో వ్యాపారాలు జోరందుకున్నాయి. టీవీలపై తంలో ఉన్న 28శాతం జీఎస్టీని 18శాతానికి కుదించడంతో 34 నుంచి 65 ఇంచుల సైజులో ఉన్న టీవీల ధరలు రూ.4వేలనుంచి రూ.6వేల వరకు తగ్గాయి. ఏసీలపై 18శాతానికి మార్చడంతో టన్ను నుంచి రెండు టన్నుల కెపాసిటీ ఏసీల ధరలు రూ.5వేలనుంచి రూ.9వేల వరకు దిగివచ్చాయి. ద్విచక్రవాహనాలపై ఇప్పటి వరకు 28శాతం జీఎస్టీ ఉండగా దాన్ని 18శాతానికి మార్చడంతో 125 సీసీ నుంచి 155 సీసీ వరకు రూ.17వేల వరకు తగ్గుముఖం పట్టాయి. దీంతో బైక్‌ల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. మరోవైపు చిన్నకార్లపై జీఎస్టీ తగ్గగా పెట్రోలు, డీజిలు, ఎల్‌పీజీ, సీఎన్‌జీ కార్లపై జీఎస్టీ 28శాతం నుంచి 18శాతానికి తగ్గింది. దీంతో చిన్న కార్ల ధరలు రూ.40వేల నుంచి రూ.60వేల వరకు తగ్గాయి. ఎలక్ట్రిక్ వాహనాలకు 5శాతం పాత జీఎస్టీనే కొనసాగుతోంది. రేట్లు తగ్గడంతో కొత్త వాహనాల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఈసారి వాహనాల కొనుగోళ్లు పెరిగాయని షోరూమ్‌ల యజమానులు చెప్తున్నారు. 1న పింఛన్ల సొమ్ము కూడా చేతికందడంతో పింఛనుదారుల్లోను పండగ జోష్ కనిపించింది. మొత్తం మీద జీఎస్టీ తగ్గుదల, దసరా ఆఫర్లతో జిల్లాలో రూ.వంద కోట్ల మేర వ్యాపారం జరిగినట్టు అంచనా వేస్తున్నారు.

కిక్కిరిసిన షాపింగ్ మాల్స్

దసరా పండగ వేళ వివిధ షాపింగ్ మాల్స్, ఆన్‌లైన్ స్టోర్స్, స్పెషల్ క్యాష్‌బ్యాక్ ఆఫర్లు, డిస్కౌంట్లు ప్రకటించాయి. ఫ్యామిలీ షాపింగ్, పండగ డెకరేషన్‌కోసం కొత్త ఐటెమ్స్‌కు డిమాండ్ బాగా పెరిగింది. మొబైల్స్‌ను ఆన్‌లైన్‌లో ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. పండగ షాపింగ్‌తో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, పిఠాపురం, పెద్దాపురం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, తుని, తదితర ప్రాంతాల్లో మార్కెట్లు కళకళలాడాయి. కాకినాడ, రాజమహేంద్రవరం వంటి నగరాల్లో పెద్ద షాపింగ్ మాల్స్ జనంతో కిటకిటలాడుతున్నాయి. దసరా పదిరోజులూ దుర్గమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాయి. జిల్లాలోని అన్ని అమ్మవార్ల ఆలయాల్లో ఆధ్యాత్మికత నెలకొంది. శరన్నవరాత్ర ఉత్సవాల్లో దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. ప్రత్యేక పూజలతో అమ్మవారిని కొలుస్తున్నారు. కొందరు భవానీ మాలలు ధరించి దుర్గమ్మ దీక్ష చేపట్టారు.

ఆలయాలకు..

విజయదశమి శోభ



పాదగయ క్షేత్రంలో విజయదశమి పర్వదినాన నిర్వహించే తెప్పోత్సవం

- పలు దేవాలయాల్లో విజయదశమికి ప్రత్యేక పూజలు
- వాహన, ఆయుధ పూజలకు ప్రాధాన్యం
- పాదగయ పుష్కరిణిలో తెప్పోత్సవం

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

ఆలయాలు దసరా శోభ సంతరించుకున్నాయి.శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పదిరోజులుగా పూజలు జరుగుతున్నాయి. విజయదశమి పర్వదినాన జిల్లాలోని ప్రముఖ దేవాలయాల్లో విశేష పూజల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. పలుచోట్ల బుధవారం రాత్రే ప్రారంభమైన దసరా సంబరాలు గురువారంరాత్రి వరకు కొనసాగనున్నాయి.

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దసరా(విజయదశమి) పండగకు సర్వం సిద్ధమైంది. అమ్మవార్లకు పిండి వంటలు, స్వీట్లు వండి ప్రసాదంగా నివేదించేందుకు అవసరమైన సరుకులను, పూజసామగ్రిని కొనుగోలులో భక్తులు బిజీగా ఉన్నారు. గురువారం తెల్లవారుజామునే ఇంటిల్లిపాదీ స్నానాలు ఆచరించి ఆలయాలకు వెళ్లడంతోపాటు ఇళ్లల్లో దేవీ పూజలు నిర్వహిస్తారు.పలుచోట్ల వాహన, ఆయుధ పూజలు జరుగుతాయి. ఇందుకు జిల్లాలోని ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. పిఠాపురం పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదిశంకరాచార్య ప్రతిష్ఠిత రాజరాజేశ్వరీదేవి, దశమశక్తి పీఠమైన పురుహూతికా అమ్మవారు, అన్నవరంలో వనదుర్గాదేవి, తుని సమీపంలో తలుపులమ్మ అమ్మవారు, పంచారామాల్లో ఒకటైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి దేవస్థానం, కాకినాడ నగరంలోని బాలాత్రిపురసుందరి అమ్మవారి ఆలయంతో పాటు జిల్లాలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో ఉన్న కనకదుర్గ, ఇతర అమ్మవార్ల ఆలయాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. విద్యుద్దీపాలతో అలంకరించారు. గురువారం ఉదయం నుంచీ కుంకుమపూజల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. పాదగయ పుష్కరిణిలో అమ్మవార్ల తెప్పోత్సవం జరగనుంది. కాకినాడలో బాలాత్రిపురసుందరికి బంగారం చీర అలంకరణ చేయనున్నారు.జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని అమ్మవార్ల ఆలయాల ప్రాంగణాల్లో నుశమీ పూజ నిర్వహించనున్నారు. పలుచోట్ల బుధవారం రాత్రే దసరా సంబరాలు ప్రారంభమయ్యాయి. పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇవి గురువారం అర్ధరాత్రి దాకా కొనసాగుతాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆయా ఆలయాల కమిటీలు, దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన దుర్గా మండపాల్లోని అమ్మవార్లకు పూజల తర్వాత శోభాయాత్ర నిర్వహించేందుకు కమిటీలు సన్నాహాలు చేస్తున్నాయి.

జీఎస్టీ తగ్గింపుతో ఆక్వా రైతులకు లాభాలెన్నో..

10

రేపటినుంచి క్షేత్రస్థాయిలో భూ సర్వే

- జిల్లా సర్వే, భూ రికార్డుల అధికారి శ్రీనివాసు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నుంచి క్షేత్ర స్థాయిలో భూ సర్వే జరుగుతుందని జిల్లా సర్వే, భూ రికార్డుల అధికారి కె.శ్రీనివాసు పేర్కొన్నారు. బుధవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. కాకినాడ డివిజన్ పరిధిలోని తాళ్లరేవు మండలం పి.మల్లవరం, యు.కొత్తపల్లి మండలం కొమరగిరి, పెద్దాపురం డివిజన్‌లోని జగ్గంపేట మండలం బలభద్రపురం, తిరుపతిరాజుపేట, ప్రత్తిపాడు మండలం కె.కొత్తపల్లి, రౌతులపూడి మండలం ఎగువ సివాడ, దిగువ దారపల్లి, ఎగువ దారపల్లిల్లో క్షేత్రస్థాయిలో సర్వే చేస్తారన్నారు. గ్రామ సర్వేయర్లు, మండల సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొంటారు. ఆయా గ్రామాల్లో రైతులు అధికారులకు వారి భూసరిహద్దులను చూపించాలని వారు కోరారు.

వసతిగృహాలకు పంపే బియ్యం ప్యాకింగ్‌కు

టెండర్ల ఆహ్వానం

- జిల్లా జేసీ రాహుల్ మీనా



కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖ ద్వారా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు పంపే సన్నబియ్యం ప్యాకింగ్ పంపిణీకి ఆన్‌లైన్ టెండర్లు స్వీకరిస్తున్నామని జేసీ రాహుల్ మీనా తెలిపారు. ఈ ప్రక్రియపై ఏజెన్సీలకు అవగాహన కల్పించేందుకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లో పౌరసరఫరాల సంస్థ, ఏజెన్సీల ప్రతినిధులతో ప్రీబిడ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలకు క్యూఆర్ కోడ్ కలిగిన 25 కిలోల సన్నబియ్యం బస్తాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు మూడు కిలోల సన్న బియ్యం ప్యాకింగ్ చేసి పంపిణీ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పౌరసరఫరాల సంస్థ పరిధిలో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్లకు సన్న బియ్యం 25 కిలోలు, మూడు కిలోల్లో క్యూఆర్ కోడ్‌తో ప్యాకింగ్ చేసి అందించేందుకు ఆసక్తి కలిగిన ఏజెన్సీల ద్వారా ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు వెల్లడించారు. ఈ నెల 5వతేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా టెండర్లు సమర్పించవచ్చన్నారు. 8న టెండర్లు ఓపెన్ చేసి అర్హులైన ఏజెన్సీలకు సన్న బియ్యం ప్యాకింగ్ చేసే ప్రక్రియ అప్పగిస్తామన్నారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు దేవులనాయక్, ఏస్టీటీ శివకుమార్‌నాయుడు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాకినాడ



పిఠాపురం పాదగయ క్షేత్రంలో మహిషాసురమర్దిని అలంకారంలో దర్శనమిస్తున్న రాజరాజేశ్వరీదేవి

జిల్లాలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. మహర్నవమి సందర్భంగా బుధవారం ప్రముఖ ఆలయాల్లో అమ్మవార్లు మహిషాసురమర్దినిగా దర్శనమివ్వగా పలుచోట్ల విశేష అలంకరణల్లో భక్తులకు అనుగ్రహించారు.

జయ జయహే మహిషాసురమర్దిని



గొల్లప్రోలు మండలం దుర్గాడలో సకల కళా స్వరూపిణిగా దర్శనమిస్తున్న లలితాదేవి



గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో కాళీమాత అవతారంలో అపర్ణాదేవికి యాలకులతో చేసిన అలంకారం



సామర్లకోటలో రాజరాజేశ్వరీదేవి అలంకరణలో బాలాత్రిపురసుందరి అమ్మవారు



పెద్దాపురంలో మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన భువనేశ్వరి అమ్మవారు

పిఠాపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయలో రాజరాజేశ్వరీదేవి బుధవారం మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహాగణపతి స్వామికి విఘ్నేశ్వర పూజ, కుక్కుటేశ్వరస్వామికి, దత్తాత్రేయ స్వామికి అభిషేకాలు, రాజరాజేశ్వరీదేవికి ప్రాతః కాల విశేష సహస్రనామార్చన, సామూహిక విశేష కుంకుమార్చనలు, సాయంకాల ప్రత్యేకార్చనలు, మహా నివేదన జరిగాయి. మహర్నవమి సందర్భంగా పురుహూతికా అమ్మవారికి శతచండీయాగ సంకల్పం, చండీ పారాయణ, శ్రీచక్ర నవావరణార్చన సహిత ప్రత్యేక సహస్ర పుష్పార్చన, శ్రీచక్ర లక్ష కుంకుమార్చన నిర్వహించారు. పురుహూతికా అమ్మవారిని పుష్పాలతో అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో, సహాయ కమిషనరు కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపురసుందరికి ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కంచి మహా సంస్థానంలో స్వయంవరపార్వతి అమ్మవారికి చంద్రాభట్ల పతంజలి-పద్మ దంపతులు పూజలు చేశారు. హరిహర క్షేత్రం అన్నపూర్ణా సమేత రామలింగేశ్వరాలయంలో వ్యవస్థాపకుడు పరమానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో పూజలు జరిపారు. అన్నపూర్ణమ్మను మహిషాసురమర్దినిగా అలంకరించారు. పండితుడు పెండ్యాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. బడేలమ్మ చెరువు వద్ద నవదుర్గాలయంలో కనక విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): స్థానిక వర్ణుల వారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిపారు.



పిఠాపురంలో పాదగయ క్షేత్రంలో పురుహూతికా అమ్మవారికి పుష్పమాలలతో ప్రత్యేక అలంకారం



కొత్తపల్లి మండలం కొమరగిరిలో మహాకాళి అలంకరణలో బాలకనకదుర్గమ్మ

పెద్దాపురం మరిడమ్మ, కాండ్రకోట నూకాలమ్మ మహిషాసురమర్దినిగా అభయమిచ్చారు. ఈవోలు కె.విజయలక్ష్మి, ఎం.రాంబాబురెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు బస్టాండు, కరణంగారితోట, మార్కండేయపురం, ఈబీసీ కాలనీ, దేవినగర్ తదితర ప్రాంతాల్లోని కనకదుర్గ ఆలయాల్లో కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. ఆయా ఆలయాల కమిటీల ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో లలితాదేవి సకల కళా స్వరూపిణిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు అమ్మవారిని నిమ్మకాయలతో అలంకరించారు. సౌభాగ్య స్త్రీలతో లలితా సహస్ర నామ కుంకుమార్చన నిర్వహించారు. సేవా సమితి సభ్యులు ఏర్పాట్లను తాటిపర్తి గ్రామంలో అపర్ణాదేవి కాళీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి మూడు కిలోల యాలకులతో అలంకారం చేశారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): విజయదశమిని పురస్కరించుకుని కొండెవరంలో కనక దుర్గాదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కాళికాదేవి ప్రదర్శన గ్రామస్తులను ఆకట్టుకుంది. ఆరుగురు వ్యక్తులు కాళికా దేవి అలంకరణతో గ్రామ ప్రధాన వీధుల్లో పులకరింపచేశారు. కొమరగిరిలో బాలకనకదుర్గమ్మ మహాకాళి అలంకరణలో అభయమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.





టీడీపీ జిల్లా కార్యాలయంలో బాలయోగి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు, యానాం రోడ్డులో బాలయోగి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

బాలయోగి ఆశయ సాధనకు కృషి చేయాలి

కాకినాడ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కోనసీమ అభివృద్ధి ప్రదాత బాలయోగి ఆశయ సాధనకు కృషి చేయాలని సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కోరారు. లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి 74వ జయంతి సందర్భంగా బుధవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేతో పాటు ముఖ్య నాయకులు, కార్యకర్తలు బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు కొల్లాబత్తుల అప్పారావు, మట్టా ప్రకాష్ గౌడ్, పంతాడి రాజు, నాయకులు తుమ్మల రమేష్, అంబటి చిన్న, మన్నే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. దళిత, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహోన్నత నేత బాలయోగి సేవలు అజరామరం అని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. యానాం రోడ్డులో గల బాలయోగి విగ్రహానికి ఆయన పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను రాష్ట్ర ప్రజలు, కోనసీమ వాసులు ఎన్నటికీ మరువలేరన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, నాయకులు బొడ్డు దేవరాజు, తుమ్మల రమేష్, సీకోటి అప్పలకొండ, బంగారు సత్యనారాయణ, అంబటి చిన్న, పోలిపల్లి జగన్, గొరుసు వెంకటదుర్గారావు, పసగడుగుల శేషగిరిరావు, బూడి ప్రకాష్, జాన్‌వెస్లీ, మండపాక దుర్గాప్రసాద్, తెప్పల రామలింగేశ్వరరావు, సయ్యద్ అలీ, చింతపల్లి తాతారావు, పాలెపు రాజు, పీర్ల లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

బోనాలతో తరలివచ్చిన మహిళలు



గొల్లప్రోలు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. గొల్లప్రోలు మండలం చేబ్రోలు రామాలయం సెంటరు వద్ద మహిళలు బోనాలు ఎత్తుకుని ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న చెందుర్తి సెంటర్లోని కనకదుర్గమ్మ ఆలయానికి ప్రదర్శనగా తరలివచ్చారు. దుర్గాదేవికి బోనాలు సమర్పించి పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సూపర్‌బజార్ కొత్త డైరెక్టర్ల ప్రమాణస్వీకారం

కాకినాడ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సూపర్‌బజార్‌లో ఖాళీ అయిన ముగ్గురు డైరెక్టర్ల ఎంపిక బుధవారం జరిగింది. మూడేళ్ల కాల వ్యవధిలో డైరెక్టర్లుగా ఏబీవీటీ నమశ్శివాయ, జి.సుబ్రహ్మణ్యంచౌదరి, మల్లిపూడి శివరామకృష్ణ ప్రమాణం చేయగా వైస్ చైర్మన్‌గా మల్లిపూడి శివరామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సూపర్‌బజార్ చైర్మన్ ప్రెసింగి ఆదినారాయణ మాట్లాడుతూ వినియోగదారుల అభిమానం చూరగొనేలా అందరూ కలిసి పని చేయాలని సూచించారు. సీఈవో వి.శివాజీగణేష్, ఎన్నికల అధికారి ఆర్ఎస్ సుధాకరరావు, డైరెక్టర్లు మన్నే నాగేశ్వరరావు, ముమ్మిడి పవన్‌కుమార్, డీవీడీ ప్రసాద్, బి.బాలకృష్ణ, డీవీ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



సూపర్‌బజార్ మొత్తం డైరెక్టర్లు

ఉధృతంగా శబరి



పరిమితికి మించి పడవపై ప్రయాణిస్తున్న లోతట్టు వాసులు

- చింతూరు వద్ద 36.5 అడుగులు
- ప్రమాదపుటంచున పడవ ప్రయాణం
- పరిమితికి మించి ఎక్కుతున్న లోతట్టు ప్రాంతాల ప్రజలు
- ఒకరికి పాము కాటు



కూనవరం వద్ద బ్రిడ్జిని అనుకుని ప్రవహిస్తున్న శబరి నది

చింతూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): చింతూరు వద్ద శబరి ఉధృతి మరింతగా పెరిగింది. బుధవారం సాయంత్రం నీటి మట్టం 36.5 అడుగుల మేర ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద గోదావరి మంగళవారం రాత్రి 50అడుగులు మేర ప్రవహించగా బుధవారం సాయంత్రం 5గంటలకు ఉధృతి తగ్గి 45.5 అడుగులకు చేరుకుంది. అదే దశలో కూనవరం వద్ద గోదావరి 47 అడుగుల మేర ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద గోదావరి తగుముఖం పట్టినప్పటికీ కూనవరం వద్ద శబరికి గోదావరి ఎగపోటునివ్వడంతో చింతూరు వద్ద శబరి పెరగడానికి కారణంగా మారింది. ఇక గడిచిన ఐదు రోజుల మాదిరిగానే బుధవారం కూడా చింతూరు మీదుగా ఒడిస్సాకు వెళ్లే 326వ జాతీయ రహదారితో పాటు చింతూరు వరరామచంద్రపురం, కూనవరం మండలాల నడుమ రాకపోకలు సాగడం లేదు. బుధవారం చింతూరులో వారాంతపు సంత కావడంతో గడచిన ఐదు రోజులుగా నిత్యావసర వస్తువులు కోసం ఇక్కట్లు పడుతున్న లోతట్టు వాసులు పెద్ద ఎత్తున చింతూరు సంతకు పడవలపై చేరుకున్నారు. నిత్యావర వస్తువులు కొనుగోలు చేసి తిరిగి వారంతా సోకిలేరు వాగు పడవపై దాటి వారి గ్రామాలకు చేరుకొనే దిశలో ఒక్కసారిగా రద్దీ పెరిగింది. దీంతో చీకటి పడక ముందే ఇళ్లకు చేరుకోవాలన్న ఆత్రుతతో పరిమితిని మించి పడవ దాటారు. తాము ఎంత వారించినా తమ మాట ఎవరూ వినడం లేదని పడవ నిర్వాహకులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా నర్సింగపేటకు చెందిన రవ్వ గంగయ్య పాము కాటుకు గురవడంతో అతడిని ముందుగా సోకిలేరు వాగుపై పడవ దాటించి అక్కడ నుంచి చింతూరు తరలించారు. అదే గ్రామంలో నిరీక్షణ కుమార్ బాగా నీరసించడంతో ఆ యువకుడిని కూడా సోకిలేరు మీదుగా ఆసుపత్రికి తరలించారు. నాటు పడవపై పరిమితి మించి ప్రయాణం చేస్తున్న నేపథ్యంలో చింతూరు తహశీల్దార్ సయ్యద్ హుస్సేన్‌ని ఆంధ్రజ్యోతి సంప్రదించగా వాగుల వద్ద సిబ్బందిని నియమించామని నియంత్రణ చేస్తున్నామన్నారు.

సంగమం వద్ద చేపల సందడి



ఒకవైపు శబరి, గోదావరి నదులు ఉధృ తంగా ప్రవహిస్తుంటే మరోవైపు ఆ నదుల సంగ మం వద్ద చేపలు సందడి చేశాయి. కూనవరంలోని ఈ రెండు నదుల కలయిక వద్ద చేపలు గుంపులు గుంపులుగా తిరుగుతూ చూపరులను ఆకట్టుకున్నాయి. భారీ చేపలు సైతం గోదావరి ఒడ్డు దగ్గరికి వచ్చి మళ్లీ గోదావరి వైపుకి వెళ్లే దృశ్యాలు పలువురిని అలరించాయి.

గోదావరి తగ్గుముఖం

కూనవరం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో ఐదోసారి వచ్చిన గోదావరి వరద ఈసారి పూర్తిగా రైతులను నట్టేట ముంచింది. మిర్చి రైతులకు పూర్తి నష్టం వాటిల్లింది. బుధవారం ఉదయం నుంచి గోదావరి వరద క్రమేపీ తగ్గడం ప్రారంభించింది. 47.77 అడుగులు వచ్చిన గోదావరి బుధవారం సాయంత్రానికి మెల్లగా తగ్గుతూ 47 అడుగులకు చేరుకంది. గిన్నెల బజారు, శబరి కొత్తగూడెం, ఉదయ్‌భాస్కర్ కాలనీలోని ఇళ్లు ముంపునకు గురయ్యాయి. వరదలను దృష్టిలో పెట్టుకుని ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ గాంధీబాబు ముంపు బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేశారు.



పంట నష్టం సహా పోలవరం ముంపు పరిహారం చెల్లించాలని జల దీక్ష చేస్తున్న చూటూరు వాసులు

పరిహారం చెల్లించాలని జలదీక్ష

చింతూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తమకు పంట నష్ట పరిహారంతో సహా పోలవరం ప్రాజెక్టు నష్ట పరిహారం చెల్లించాలని చూటూరు గ్రామానికి చెందిన ఆదివాసీ రైతులు, గ్రామస్థులు బుధవారం జల దీక్ష చేశారు. చూటూరులో వరద కారణంగా వరి పంటంతా నీట మునిగింది. దీంతో వారంతా నష్ట పోయారు. ప్రతి ఏటా ఇదే రీతిన తాము నష్ట పోవాల్సి వస్తోందని, ఇప్పటికైనా ప్రభుత్వం తమకు పంట నష్ట పరిహారంతో సహా పోలవరం పరిహారం కూడా తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామస్థులు, రైతులు మునిగిన వరి పొలాల వద్దకు చేరుకొని నినాదాలు చేశారు.

మల్లెలు@1500

కాగడాలు రూ.1200, జాజులు రూ.1000

పూల మార్కెట్‌కు దసరా శోభ



కడియపులంక పూలమార్కెట్

కడియం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): శరన్నవ రాత్రులు సందర్భంగా కడియపులంక అంతరాష్ట్ర పూలమార్కెట్‌లో శోభ సంతరించుకుంది. నవరాత్రులలో భవానీభక్తులు, భక్తులు నిత్యం పూజల్లో భాగంగా పూల కొనుగోలుతో మార్కెట్ బిజీగా మారింది. గురువారం విజయదశమి సందర్భంగా షాపులు, ఇళ్ల అలంకరణలతో పాటు అమ్మవారి పూజకు కావాల్సిన పూల కొనుగోలు చేసే వారితో మార్కెట్ మరింత బిజీగా ఉంది. కడియపులంక అంతరాష్ట్ర పూల మార్కెట్‌లో పూలధరలు ఇలా ఉన్నాయి.

చామంతి (కిలో) రూ. 200-250	గులాబీ (100 పూలు) రూ.200
తెలుపు చామంతి (కిలో) రూ.300	డచ్ (20పూలు) రూ.350
నీలం చామంతి (కిలో) రూ.200-250	కనకంబరం (బారు-1) రూ.300-350
వైట్‌స్నోబాల్ చామంతి (కిలో) రూ.400	చిట్టిగులాబీ (కిలో) రూ. 425
పసుపు బంతి (కిలో) రూ.100-120	సెంటు గులాబీ (కిలో) రూ.250
ఎరుపుబంతి (కిలో) రూ.110 -130	కాగడాలు (కిలో) రూ.1,200
కలకత్తాబంతి (కిలో) రూ.120 -130	జాజులు (కిలో) రూ.1,000
లిల్లీ (కిలో) రూ.300	మల్లెలు (కిలో) రూ.1,500

బతుకమ్మ.. బతుకమ్మ..

ముగిసిన సంబరాలు

ఎటపాక, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): దేవీనవరాత్రుల సందర్భంగా విలీన మండలాల్లో పదిరోజులపాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు బుధవారంతో ముగిశాయి. ఆఖరిరోజు మహిళలు పెద్దఎత్తున రకరకాల పూలతో బతుకమ్మలను తయారుచేసి ఆటపాటలతో సందడి చేశారు. ఈ నేపథ్యంలో మండలంలోని తోటపల్లిలో క్వింటాలన్నర వివిధ రకాల పూలతో 10 అడుగుల ఎత్తులో బతుకమ్మను తయారుచేశారు. మహిళలు కోలాటాలతో ఊరేగింపు కార్యక్రమంతో నిమజ్జనం చేశారు.



రేపటి నుంచి క్రీడాకారుల ఎంపిక

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రెండో విడత అండర్-14, 17, 19 బాలబాలికల ఎంపికలు నిర్వహిస్తున్నట్టు కార్యదర్శులు శ్రీనివాస్, సుధారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో టెన్నిస్,4న కాకినాడ డీఎస్ఏలో స్క్వాష్, రెజ్లింగ్, మోడ్రన్ పెంటాథ్లాన్, తైక్వాండో, సైక్లింగ్-రోడ్, ట్రాక్, స్కేటింగ్, కాకినాడ రాజా ట్యాంక్ ఆవరణలోని వైఎస్సార్ స్కేటింగ్ రింక్‌లో స్కేటింగ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలోని మహాత్మాగాంధీ ఎయిడెడ్ స్కూల్లో నెట్‌బాల్, 6న కాకినాడ డీఎస్ఏలో రగ్బీ, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, కాకినాడ రూరల్ ఎన్టీఆర్ బీచ్‌లో బీచ్ వాలీబాల్, 7న కాకినాడ డీఎస్ఏలో హాకీ, బేస్‌బాల్, స్విమ్మింగ్, డైవింగ్ ఎంపికలు జరుగుతాయి. ఆసక్తి కలవారు ఆయా తేదీల్లో ఉదయం 8.30 గంటలకు వేదికల వద్దకు హాజరుకావాలని కోరారు.

కోట సత్తెమ్మకు ప్రత్యేక పూజలు

నిడదవోలు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాల భాగంగా పదో రోజు బుధవారం మహార్నవమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి నిత్యాభిషేకం, ప్రత్యేక సహస్రనామ కుంకుమ పూజలు, చండీ పారాయణం, సాయంకాలం హోమం నిర్వహించారు.అనంతరం లింగంపల్లికి చెందిన నీలాలమ్మ దుర్గమ్మ కమిటీకి చెందిన భవానీలు అమ్మవారికి సారె సమర్పించారు.

జగ్గంపేట శివారులో ఆడ శిశువు లభ్యం

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట శివారులో రోడ్డు పక్కన ఒక ఆడ శిశువు లభ్యమైందని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి సీహెచ్ లక్ష్మి తెలిపారు. మేడపాడు గ్రామానికి చెందిన వల్లూరి సురేష్ జూలై 31వ తేదీ రాత్రి పొలం పనులు ముగించుకుని వస్తుండగా రోడ్డు పక్కన పాపను గుర్తించి ఇంటికి తీసుకెళ్లాడని, అనంతరం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి ఆగస్టు 13న కాకినాడ శిశు గృహానికి అప్పగించినట్టు ఆమె బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పాప ఆరోగ్యం బాగోలేక కాకినాడ జీజీహెచ్‌లోని పీఐసీయూలో చికిత్స పొందుతోందన్నారు. పాప తల్లిదండ్రులు లేదా బంధువులు ఆధారాలతో 30రోజుల్లోగా ఐసీడీఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె కోరారు. లేనిపక్షంలో పాపను చట్టబద్ధంగా దత్తత ఇస్తామని స్పష్టం చేశారు.

కాలువలో దూకి వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

కాపాడిన స్థానికులు

నిడదవోలు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నిడదవోలు సమిశ్రగూడెం పైన ఉన్న ఆర్వోబీ పైనుంచి బుధవారం సుమారు 70 సంవత్సరాల వయసున్న వృద్ధుడు గోదావరి పశ్చిమ డెల్టా కాలువలోకి దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. పక్కనే ఉన్న స్థానికుడు వాలా వెంకటేశ్వర్లు కాలువలోకి దూకి వృద్ధుడిని రక్షించాడు. వృద్ధుడు శ్రీకాకుళం జిల్లాకు చెందిన రేగడి సింహాచలంగా గుర్తించారు. ఒంటరితనం భరించలేక కాలువలోకి దూకి ఆత్మహత్యాయత్నం చేసినట్టు సమాచారం.

రాజ్యసభలో కామర్స్ కమిటీ సభ్యుడిగా సతీష్‌బాబు



కాకినాడ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల నియామకంలో భాగంగా రాజ్యసభలో కామర్స్ కమిటీ సభ్యుడిగా ఆంధ్రప్రదేశ్ నుంచి కాకినాడ జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు నియమితులయ్యారు. ఈ కమిటీలో రాజ్యసభ నుంచి 10 మంది నియమితులు కాగా అందులో సతీష్‌బాబుకు స్థానం లభించింది. ఈ మేరకు రాజ్యసభ పార్లమెంటరీ కమిటీ బుధవారం బులెటిన్ విడుదల చేసింది.





కాకినాడ, పిఠాపురంల్లో పెన్షన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు, మాజీ ఎమ్మెల్యే వర్మ

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

కాకినాడ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జగన్నాథపురం 20వ డివిజన్ పరిధిలోని కవేలా రోడ్, మహాలక్ష్మి నగర్‌లలో లబ్ధిదారులకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు బుధవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గోరుసు వెంకటదుర్గారావు, జాన్‌వెస్లీ, పాలపు నాగేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మిరపకాయల వీధిలో లబ్ధిదారులకు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ బుధవారం పెన్షన్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు నామ కనకారావు, టీడీపీ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్, నాయకులు సందిన నందిబాబు, కొరుప్రోలు శ్రీను, పిల్లి చిన్నా, మొల్లి నాగమరిడిరాజు, సూరవరపు సుబ్బారావు, నామ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

‘గొడవలకు దిగితే కఠిన చర్యలు’

పిఠాపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలిగేలా వ్యవహరించినా, గొడవలకు దిగినా కఠిన చర్యలు తీసుకుంటామని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ హెచ్చరించారు. మహా సంస్థానం వద్ద గల ఆటో యూనియన్‌లో జరుగుతున్న గొడవలు, దాడుల నేపథ్యంలో బుధవారం ఆయన ఆటో డ్రైవర్లను పోలీసు స్టేషన్‌కు పిలిపించి అవగాహన కల్పించారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని, భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. భక్తులకు, అక్కడి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎస్ఐ మణికుమార్ పాల్గొన్నారు.





శానిటేషన్ వర్కర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

‘గ్రామాల పరిశుభ్రతలో శానిటేషన్ సిబ్బంది సేవలు అమోఘం’

సర్పవరం జంక్షన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆరోగ్యంగా జీవించేందుకు శానిటేషన్ సిబ్బంది చేస్తున్న సేవలు ఎంతో విలువైనవని ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం రమణయ్యపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శి పిడుగు పాండు రంగారావు ఆధ్వర్యంలో విశేష సేవలు అందించిన శానిటేషన్ వర్కర్లను ఘనంగా సత్కరించారు. వారికి నూతన వస్త్రాలు అందించారు. ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, ఎంపీడీవో పసుపులేటి సతీష్ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ ఎంఈవో తుమ్మల సత్య రంగారావు ఆధ్వర్యంలో మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన 79 మంది ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరంతో కలసి నియామక పత్రాలను ఎమ్మెల్యే పంతం నానాజీ అందించారు. వారిని సత్కరించారు. ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఎంపీడీవో పసుపులేటి సతీష్, కూటమి నాయకులు కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), పెంకే శ్రీనివాసబాబా, నులుకుర్తి వెంకటేశ్వరరావు, కరెడ్ల గోవిందు, మాదారపు తాతాజీ, గోపు వెంకటరమణ, పుల్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

‘రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా భావించాలి’

డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా నిర్వర్తించడానికి ప్రజలు ముందుకు రావాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ పిలుపునిచ్చారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం రెడ్‌క్రాస్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించిన పీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ, ప్రగతి ఇంజనీరింగ్ కాలేజీ, లోకల్ బిజినెస్ నెట్‌వర్క్ ప్రతినిధులను, రక్తదాతలు డాక్టర్ వీఆర్ఎన్‌బీ ప్రసాద్, భాను గురు ప్రకాష్, వెంకటసురేష్, బాలబ్రహ్మనాథ్‌లను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ వైడీ రామారావు సేవా కార్యక్రమాలను కొనియాడారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు, ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందజేయడమే ప్రధాన లక్ష్యంగా భావిస్తూ రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలను ప్రోత్సహించడానికి ముందుకు రావాలని వైడీఆర్ కోరారు. అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ ఐ.ప్రభాకర్, రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరాశర పాల్గొన్నారు.



రక్త దాతను సత్కరిస్తున్న డీఎంహెచ్‌వో నాయక్, రెడ్‌క్రాస్ ఛైర్మన్ వైడీ రామారావు

‘గాంధీ పుట్టిన దేశంలో మద్యం వద్దు’

పిఠాపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గాంధీ పుట్టిన దేశంలో మద్యం వద్దంటూ మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో పిఠాపురం బంగారమ్మ రావిచెట్టు సెంటర్లోని గాంధీ విగ్రహం వద్ద బుధవారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గాంధీజీ స్ఫూర్తితో యువత మద్యం, మాదకద్రవ్యాలకు స్వయం ప్రకటిత నిషేధం అమలు చేసుకుని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ జిల్లా కన్వీనర్ ఎస్.సూర్యనారాయణ, కరణం విశ్వనాథం, మిరియాల చంటి, వనపర్తి సూర్యనారాయణ, లతారత్నం తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ప్రతినిధులు



జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి సిరిల్

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ప్రయోజనం

గొల్లప్రోలు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని జిల్లా ఉద్యానవన శాఖాధికారి టీవీ సిరిల్ తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో బుధవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపు వల్ల బయో పెస్టిసైడ్స్‌పై 7శాతం, ట్రాక్టర్లుకు 7శాతం, వ్యవసాయ డ్రోన్లపై 13శాతం, డ్రిప్ ఇరిగేషన్‌పై 7శాతం తగ్గుతుందని వివరించారు. సమావేశంలో గొల్లప్రోలు ఎంపీడీవో సెలట్‌రాజు, వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ, జీఎస్టీ పర్యవేక్షకుడు కోటిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.









దుర్గమ్మ తల్లికి సారె తీసుకెళ్తున్న పెద్దాపురప్పాడు గ్రామస్తులు, సర్వాలంకరణలో అమ్మవారు

పెద్దాపురప్పాడు దుర్గమ్మ తల్లికి
భారీ సారె సమర్పణ

కరప, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురప్పాడులో కొలువుదీరిన కనకదుర్గ అమ్మవారికి బుధవారం గ్రామస్తులు భారీ సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామానికి చెందిన వందలాది మంది మహిళలు తమ శక్తికొలదీ పలు రకాల స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, ఇతర సారె తీసుకుని గంగమ్మ తల్లి గుడి వద్ద నుంచి భారీ ప్రదర్శనగా ఊరంతా తిరిగారు. అనంతరం దుర్గమ్మ గుడికి చేరుకుని సారె సమర్పించి భక్తితో పూజలు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొలిసారిగా అమ్మవారికి భారీ సారె సమర్పించినట్టు స్థానిక పెద్దలు తెలిపారు. అర్చకుడు సతీష్ అమ్మవారికి పూజాదికాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గ్రామ పెద్దలు బిరుదా వెంకటరెడ్డి, నల్లా పట్టాభిరామయ్య, వాసిరెడ్డి సత్తిబాబు, చిన్న, నాగేష్, బాలాజీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నడకుదురులో దుర్గామాత మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గణపతి నగర్ కొత్త దిబ్బలు వీధి నుంచి భక్తులు భారీ సారె తీసుకొచ్చి అమ్మవారికి నివేదించారు. ఆదివారం భారీ అన్నసంతర్పణ నిర్వహిస్తున్నట్టు వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాసలపు విష్ణు తెలిపారు. కరప శివాలయంలో పర్వతవర్ధినీదేవి మహిషాసురమర్దినిగా భక్తులకు అభయమిచ్చారు.



భక్తుల పాలిట కల్పవల్లి
బాలాత్రిపురసుందరి

కాకినాడ సూర్యారావుపేటలో వెలసిన అమ్మవారు

ఉత్సవ కమిటీ చైర్మన్, సభ్యులు, ఈవో ఆధ్వర్యంలో వైభవంగా దేవీ శరన్నవరాత్రులు

కాకినాడ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రెండు శతాబ్దాల క్రితం కాకినాడ సూర్యారావుపేటలో వెలసిన శ్రీబాలాత్రిపురసుందరి అమ్మవారు భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా వెలుగొందుతున్నారు. 18వ శతాబ్దంలో కోమిరెడ్డి జమిందారు వద్ద గుమస్తాగా ఉన్న హేజేబు బ్రాహ్మణ వంశస్తులైన భానుసుందరం భూమి తవ్వకాల పనులు చేయిస్తున్న సమయంలో అమ్మవారి విగ్రహం బయటపడింది. భానుసుందరం సోదరుడైన భామయ్య కలలో కనిపించి తాను బాలాత్రిపురసుందరి అమ్మవారిని అని, తనకు ఆలయం కట్టించాలని కోరినట్టు స్థల పురాణం ద్వారా అవగతమవుతోంది. దీంతో కోమిరెడ్డి జమిందారు ఆజ్ఞతో హేజేబు వంశస్తులు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆలయాన్ని నిర్మించారు.

అప్పటి నుంచీ భక్తులకు అమ్మవారి నిదర్శనాలు చాలా కనిపించాయి. భామయ్య నిద్రిస్తున్నప్పుడు అమ్మవారి గజ్జెల చప్పుడు, ఒక్కోసారి గాజుల చప్పుడు కూడా వినిపించేదట. ఆ తర్వాత భామయ్య కష్టాల్లో ఉన్నప్పుడు ఇల్లు అగ్నికి ఆహుతి కాగా తానూ అగ్నికి ఆహుతి కావాలని మంటల్లో దూకుతుండగా అమ్మవారు వచ్చి కాపాడారంట. అదే సమయంలో ఆలయంలో అర్చకునికి అమ్మవారి ముక్కు బాసర కనిపించక బాధపడుతుండగా, భామయ్యను రక్షించడానికి వెళ్లినప్పుడు అక్కడ పడిపోయిందని అమ్మవారు కలలో కనిపించి చెప్పారట. దీంతో అర్చకుడు భామయ్య ఇంటికి వెళ్లి బూడిదైన స్థలంలో వెదుకుతుండగా అమ్మవారి ముక్కు బాసర మెరుస్తూ కనిపించిందట.

అప్పటి నుంచీ బాలాత్రిపురసుందరి అమ్మవారు ఎన్నో వేల కుటుంబాలకు ఇలవేల్పుగా మారింది. భక్తుల పాలిట కొంగు బంగారమై కోరిన కోర్కెలు తీర్చే కరుణామూర్తి అయ్యింది. కాకినాడకు కల్పవల్లిగా విశేష పూజలు అందుకుంటోంది. ఆనాటి నుంచి ప్రతిఏటా బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జీ, కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజు చౌదరి, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

ఎన్ఎంఎస్ఎస్ దరఖాస్తు గడువు
15 వరకు పొడిగింపు

కాకినాడ రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 7న జరిగే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్ఎంఎస్ఎస్)కు దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినట్టు డీఈవో పి.రమేష్ తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తును ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ బీబీబీ.చ్ట్బ్ఇజీలో అందుబాటులో ఉంచామన్నారు. ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజనల్ ఎస్‌బీఐ కలెక్ట్ రశీదును జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈ నెల 18వ తేదీలోపు సమర్పించాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఎటువంటి ధ్రువపత్రాలు అవసరంలేదు కానీ పరీక్ష రాసే సమయానికి సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్‌లో కానీ, డీఈవో కార్యాలయంలో కానీ సంప్రదించాలని కోరారు.



చినరాజప్పకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

శతాయుష్షు

ఎమ్మెల్యే చినరాజప్పకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులు

సామర్లకోట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): విజయనగరం పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప తన సతీమణి అనురాధ, కుమారుడు రంగనాగ్, కోడలు, మనుమడుతో బుధవారం కలిశారు. టీడీపీ వీర విధేయులైన అతికొద్దిమంది నాయకుల్లో చినరాజప్ప ఒకరని ముఖ్యమంత్రి అభినందించి శతాయుష్షు అంటూ దీవించారు. విజయనగరం పర్యటనలో ఉన్న పలువురు మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు పుట్టినరోజు జరుపుకున్న ఎమ్మెల్యే చినరాజప్పకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎంకి రాజప్ప కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.



చినరాజప్ప కుటుంబ సభ్యులతో సీఎం





మహాలక్ష్మీ దేవిగా విశేష అలంకరణలో ఐశ్వర్యాంబిక, అమ్మవారి పాదుకలు చూపిస్తున్న స్వామి పరిపూర్ణానంద సరస్వతి

వైభవోపేతం...
మహాశక్తి యాగం

మహాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చిన ఐశ్వర్యాంబిక అమ్మవారు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో జరుగుతున్న 3వ మహాశక్తి యాగం బుధవారం పదో రోజుకు చేరుకుంది. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఐశ్వర్యాంబిక అమ్మవారిని మహాలక్ష్మీ దేవిగా అలంకరించి సూక్త, మహాలక్ష్మీ హోమాన్ని విశేష ద్రవ్యాలతో అత్యంత వైభవంగా జరిపారు. స్వామీజీ భక్తులకు అనుగ్రహభాషణ చేస్తూ... లింగ భేదం లేనిది అమ్మతత్వం అన్నారు. స్త్రీ గర్భం ధరించి ఆడ/మగ మగ బిడ్డలను ప్రసవిస్తుందన్నారు. అండపిండ బ్రహ్మాండాలకు జనని అయిన అమ్మకు లింగ భేదం ఏముంటుందన్నారు. లలితా సహస్రాన్ని చదివి అర్థం చేసుకుంటే దంపతులు జీవితంలో విడాకుల జోలికి వెళ్లరన్నారు. లలితలో స్త్రీ గొప్పతనాన్ని పురుషుడు గుర్తించి తీరతాడన్నారు. 9వ రోజునే వందకోట్లు కుంకుమార్చన పూర్తి చేసుకుని పదో రోజున అదనంగా కుంకుమార్చన అమ్మ ఆశీస్సులు, మహిళల భాగస్వామ్యంతో పూర్తి చేసుకున్నామన్నారు. గురువారం పూర్ణాహుతితో యాగం ముగుస్తుందన్నారు. నిర్వహణలో లక్షలాది మందికి ఆహారం తయారుచేసిన వంట బ్రాహ్మణులు, సిబ్బంది, లైటింగ్, టెంట్లు, ఎల్ఈడీ, లైవ్, సౌండ్ సిస్టమ్, శానిటేషన్ వర్కర్లు, వలంటీర్లు, సేవకులు, సంఘ సభ్యులు, దాతలు, ప్రభుత్వ అధికారులకు స్వామి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



లలితా సహస్రనామ కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

నమో వేంకటేశాయ!



వర్చువల్‌గా న్యూఢిల్లీ నుంచి విమాన సర్వీసును ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ పురందేశ్వరి

- రాజమండ్రి-తిరుపతి మధ్య విమాన సర్వీసు ప్రారంభం
- వర్చువల్ ద్వారా న్యూఢిల్లీ నుంచి ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి
- మధురపూడిలో జెండా ఊపి తొలి సర్వీస్ ప్రారంభించిన మంత్రి దుర్గేష్
- తొలి మూడునెలలపాటు టిక్కెట్ ధర రూ.1999, రూ.4000

కోరుకొండ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి-తిరుపతి మధ్య నూతన విమాన సర్వీసును బుధవారం ఢిల్లీనుంచి కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి వర్చువల్‌గా ప్రారంభించారు. అలయన్స్ ఎయిర్ సంస్థ ఆధ్వర్యంలో వారానికి మూడు రోజులు(మంగళ, గురు, శని వారాలు) రాజమండ్రి నుంచి తిరుపతి మధ్య ఈ విమాన సర్వీసులు నడవనున్నాయి.ఉదయం 7.40గంటలకు తిరుపతిలో బయలుదేరి 9.25గంటలకు రాజమండ్రి చేరుకుని, ఉదయం 9.50 గంటలకు రాజమండ్రిలో బయలుదేరి ఉదయం 11.20 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ విమాన సర్వీసు ప్రారంభంతో రాజమండ్రి-తిరుపతి మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. ఢిల్లీనుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో రాజమండ్రి ఎయిర్పోర్ట్ నుంచి రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి రూరల్, అర్బన్, రాజానగరం, అనపర్తి ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ కేఎస్ శ్రీకాంత్, అలయన్స్ ఎయిర్ వైమానిక సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ నవరాత్రుల సందర్భంగా రాజమండ్రి నుంచి తిరుపతికి విమాన సర్వీసు ప్రారంభించడం ఆనందంగా ఉందని, ఇది రాజమండ్రివాసులకు ఓ మంచి కానుక అన్నారు. రాజమండ్రి విమానాశ్రయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఢిల్లీ, ముంబైకి కూడా విమాన సర్వీసులు గతంలోనే ప్రారంభించడం జరిగిందన్నారు. ఇప్పుడు అవి దేశంలోనే అత్యధిక డిమాండ్ ఉన్న ఎయిర్ సర్వీసులుగా నిలిచాయన్నారు. ఉభయగోదావరి జిల్లా వాసులందరికీ సాంస్కృతిక రాజధాని రాజమండ్రినుంచి ఆధ్యాత్మిక రాజధాని తిరుపతికి విమాన సర్వీసు ప్రారంభించడం ఒక కానుకగా ఆయన అభివర్ణించారు. రాజమండ్రినుంచి తిరుపతికి విమాన టికెట్లు మొదలు పెట్టగానే వెంటనే టికెట్లు అన్నీ బుక్ అయిపోయాయి. డిమాండ్ ఉన్న మార్గాల్లో టికెట్లు రేట్లు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో రాజమండ్రి నుంచి తిరుపతి వరకు నడిచే విమాన సర్వీసులో మూడు నెలల పాటు మొదటి 35 సీట్లు రూ.1999, తర్వాత 35 సీట్లు రూ.4000కు అందించడం జరుగుతుందన్నారు. రాజమండ్రి ఎయిర్పోర్టులో 2వ టెర్మినల్ కూడా నూతనంగా నిర్మిస్తున్నాం. పనులు చురుగ్గా సాగుతున్నాయని త్వరలోనే అందుబాటులోకి తీసుకుని రావడం జరుగుతుందని పేర్కొన్నారు. రాజమండ్రి నుంచి షిరిడి, గోవా, అహ్మదాబాద్, వారాణసీ, ఇతర ప్రాంతాలకు కూడా ఎయిర్‌సర్వీసులు ప్రారంభించాలని ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుకుంటున్న నేపథ్యంలో వాటిని కూడా ప్రారంభించడానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. బెంగళూరుకు ఇప్పటికే ఒక ఎయిర్ సర్వీసు నడుస్తోందనీ, వీటికి అదనంగా వేరొక సర్వీస్‌ని కూడా ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. గోదావరి పుష్కరాలు రానున్న నేపథ్యంలో రాజమండ్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ రాజమండ్రి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజలు ఎప్పటి నుంచో తిరుపతికి ఒక విమాన సర్వీసు ఉండాలని కోరుకున్నారనీ, వారి కోరిక మేరకు తిరుపతికి విమాన సర్వీసు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. రాజమండ్రి నుంచి తిరుపతికి వెళ్లడానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకురాగానే రెండు, మూడు నెలలు గడువు ఇవ్వండి అని అడిగి అలయన్స్ సంస్థతో మాట్లాడి ఈరోజు విమాన సర్వీసును ఏర్పాటు చేశారన్నారు.



రాజమండ్రి-తిరుపతి మధ్య నూతన విమాన సర్వీసు తొలి బోర్డింగ్ పాస్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల, బత్తుల, ఆదిరెడ్డి, నలమిల్లి, ఎమ్మెల్సీ సోము

ఎయిర్‌పోర్టులో ఘనంగా..

రాజమండ్రి ఎయిర్‌పోర్టులో తిరుపతి విమాన సర్వీసు ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఈ ఫ్లైట్‌పై వాటర్ క్యాన్ ఆన్ చేసి స్వాగతం పలికారు. బోర్డింగ్ పాస్‌ను ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు లాంఛనంగా అందజేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ రాజమండ్రినుంచి తిరుపతికి విమాన సర్వీసును రాజమండ్రి ప్రాంత వాసుల చిరకాల కోరిక అని పేర్కొన్నారు. ఆ కోరికను కార్యరూపం దాల్చేలా చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరికి ధన్యవాదాలు తెలిపారు. రాజమండ్రి నుంచి ఎయిర్ కనెక్టివిటీ పెరుగుదలకు కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్, దేశవ్యాప్తంగా విమాన సర్వీసుల ద్వారా వివిధ రాష్ట్రాలకు అనుసంధానిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు. రాజమండ్రి నుంచి షిరిడి, గోవా, అహ్మదాబాద్, వారాణసీ, కొచ్చిన్‌లకు కూడా విమాన సర్వీసులు ప్రారంభించాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు కోరారు. అనంతరం రాజమండ్రి నుంచి తిరుపతికి పూర్తి ఆక్యుపెన్సీతో బయలుదేరిన విమాన సర్వీసును మంత్రి కందుల దుర్గేష్, ఇతర ప్రజాప్రతినిధులు జెండా ఊపి ప్రారంభించారు.

కోనసీమలో ఏ అభివృద్ధి పని చూసినా
బాలయోగే గుర్తొస్తారు: ప్రజాప్రతినిధులు



జీఎంసీ బాలయోగి ఘాట్‌లో నివాళులర్పించిన మంత్రి సుభాష్, ఎంపీ హరీష్, ఎమ్మెల్యేలు ఆనందరావు, సుబ్బరాజు, ఎమ్మెల్సీ రాజశేఖరం

- ఘనంగా బాలయోగి జయంతి
- అమలాపురంలో మంత్రి సుభాష్, ఎంపీ హరీష్, ఎమ్మెల్యేల నివాళులు

అమలాపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి జయంతి వేడుకలు జిల్లావ్యాప్తంగా బుధవారం ఘనంగా జరిగాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. లోక్‌సభలో టీడీపీ విప్, ఎంపీ హరీష్‌మా ధుర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. తొలుత అమలాపురంలోని తమ నివాసగృహంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం బాలయోగి స్వగ్రామమైన ఎదుర్లంకలో బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జయంతి వేడుకలు ప్రారంభించారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో ఉన్న విగ్రహాలకు పూలమాలలు వేసిన తర్వాత అమలాపురంలోని నల్లవంతెన వద్దనున్న జీఎంసీ బాలయోగి ఘాట్‌కు చేరుకుని జిల్లా టీడీపీ సహా వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, శాసనమండలి మాజీ డిప్యూటీ స్పీకర్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, టీడీపీ రాష్ట్ర నాయకులు మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, రైతువిభాగంఅధ్యక్షుడు మట్టా మహాలక్ష్మిప్రభాకర్‌తోపాటు భారీసంఖ్యలో టీడీపీ నాయకులు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, మహిళా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్అధికారి జయ వెంకటలక్ష్మి తదితరులు బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్, ఎంపీ హరీష్, ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ కోనసీమ సర్వతోముఖాభివృద్ధికి దివంగత నేత బాలయోగి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఈప్రాంతంలో అభివృద్ధి చూస్తే నాటి బాలయోగి చేసిన అభివృద్ధే గుర్తుకు వస్తుందన్నారు.

ఆర్టీవో కార్యాలయం వద్ద నివాళులు

అమలాపురంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంవద్ద బాలయోగి జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఆర్టీవో దేవిశెట్టిశ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌బాలయోగి, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, దాట్లసుబ్బరాజు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, టీడీపీ నాయకులు మెట్ల రమణబాబు, అల్లాడ స్వామినాయుడు పాల్గొన్నారు.



రవాణాశాఖ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

జీఎస్టీ తగ్గింపుతో ఆక్వా రైతులకు లాభాలెన్నో

మత్స్య శాఖ జిల్లా అధికారి కృష్ణారావు

కాకినాడ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు వల్ల ఆక్వా రైతులకు సీడ్, మేత, రసాయనాల కొనుగోలులో రాయితీ లభిస్తుందని మత్స్య శాఖ జిల్లా అధికారి వి.కృష్ణారావు పేర్కొన్నారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ వల్ల కలిగే లాభాలపై బుధవారం జగన్నాథపురంలోని స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ కాన్ఫరెన్స్ హాలులో కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్ సహకారంతో ఆక్వా రైతులకు, సముద్రంలో చేపల వేట చేసే మత్స్యకారులకు, మత్స్య సహకార సంఘాల నాయకులకు జిల్లా స్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు. మత్స్య శాఖ జిల్లా అధికారి కృష్ణారావు, సహాయ సంచాలకులు కరుణాకరరావు, శ్రావణి, కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనరు లక్ష్మి, జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షుడు బలసాడి రంగారావు ప్రసంగించారు. జీఎస్టీ తగ్గింపుపై పోస్టర్ విడుదల చేశారు. మత్స్య అభివృద్ధి అధికారి నూకరాజు, ఉమామహేశ్వరరావు, మధుబాబు, ఆక్వా రైతులు, మత్స్యకార సొసైటీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మత్స్య శాఖ జిల్లా అధికారి కృష్ణారావు

అక్షరాంధ్ర కేంద్రం పరిశీలన

కిర్లంపూడి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జగపతినగరం సత్యాకాలనీలో అక్షరాంధ్ర కేంద్రాన్ని బుధవారం జిల్లా వయోజన విద్య గణాంక అధికారి పోలిశెట్టి రాజేష్, ఇన్‌చార్జి ఎంపీడీవో ఎన్.సత్యప్రసాద్, ఎంఈవో టి.జోసెఫ్ పరిశీలించారు. ప్రతి ఒక్కరూ అక్షరాస్యత సాధించడం వల్ల సమాజంలో అన్ని విషయాలు తెలుస్తాయన్నారు. నూరుశాతం అక్షరాస్యత సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వేదకుమారి, సీసీ లోవరాజు, వీవోఏ శ్రీదేవి తదితరులు ఉన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం
• గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పేద, మధ్య తరగతి వర్గాల కోసమే జీఎస్టీ తగ్గింపు

● రంపచోడవరంలో వర్తక, మహిళా సంఘాల సమావేశంలో ఎమ్మెల్యే శిరీష



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిరీష, ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్

రంపచోడవరం, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): దేశంలో పేద, మధ్యతరగతి వర్గాల అభివృద్ధి కోసమే కూటమి ప్రభుత్వం జీఎస్టీలో సంస్కరణలను తెచ్చి పన్నులను తగ్గించి ందని రంపచోడవరం ఎమ్మెల్యే, ఎస్టీ శాసనసభా కమిటీ ఛైర్మన్ మిరియాల శిరీష అన్నారు. బుధవారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఈ మేరకు వర్తక, మహిళా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.స్మరణ్‌రాజ్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ సేవింగ్స్ పథకం ద్వారా అనేక నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుముఖం పట్టాయని ఆమె అన్నారు. అనంతరం రంపచోడవరంలో అన్ని సంఘాలు, వివిధ శాఖల అధికారులతో కలిసి జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పథకంపై భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమీషన్ సభ్యురాలు గొర్లె సునీత, పరిశ్రమల కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దిరాజు, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్కె సుభానీ, మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూ రమేష్, నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసయాదవ్, జీఎస్టీ అధికారి పి.శ్రీనివాస్, పలువురు తెలుగుదేశం నాయకులు, వివిధ సంఘాల నాయకులూ హాజరయ్యారు.

పార్టీ కోసం శ్రమించేవారికి సముచిత పదవులు

టీడీపీలో కష్టించి శ్రమించే వారికి ప్రభుత్వంలో సముచిత పదవులు దక్కుతాయని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఇటీవల కాలంలో ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ పలు సముచిత స్థానాలను పొందిన నాయకులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్టీ కమీషన్ సభ్యురాలు గొర్లె సునీత, పరిశ్రమల కార్పొరేషన్ డైరెక్టర్ జి.పెద్దిరాజు, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్కె సుబానీ, సీతపల్లి బాపనమ్మ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ అబ్బులు, ఆయా మండలాలపార్టీ ఛైర్మన్‌లు పి.అనంత మోహన్, జి.శేషుకుమార్, గోళ్ల చంటిబాబు, పల్లాల వెంకటరెడ్డి, జమాల్‌ఖాన్, తదితరులను ఎమ్మెల్యే సత్కరించారు.

సంక్షేమ అభివృద్ధేలక్ష్యం

మారేడుమిల్లి(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. బుధవారం మండలంలోని దేవరపల్లి, సున్నంపాడు గ్రామాల్లో సామాజిక ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబు రమేష్, జనసేన పార్టీ నాయకులు కుర్ల రాజశేఖర్ రెడ్డి, గురుకు శేషుకుమార్, షేక్ సుభాని, గొర్లె దెబొరా సునీత, మళ్ళ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

చింతూరు(ఆంధ్రజ్యోతి): పార్టీని బలోపేతంచేయాలని ఎమ్మెల్యే శిరీషదేవి పేర్కొన్నారు. రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల పార్టీ అధ్యక్షుల నియామకాలను ఎంఎల్ఏ బుధవారం తన స్వగృహంలో అధికారికంగా ప్రకటించారు. ఎంపికైన అధ్యక్షులకు పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే వారిందరికీ దిశానిర్దేశం చేశారు కార్యక్రమంలో చింతూరు మండల శాఖ టీడీపీ అధ్యక్షుడు జమాల్‌ఖాన్ పాల్గొన్నారు.

పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో కనకదుర్గమ్మకు పూజలు



పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో కనకదుర్గమ్మ పూజల్లో పాల్గొన్న ఉద్యోగులు

మోతుగూడెం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో బుధవారం మహిషాసుర మర్దిని అవతారం పొల్లూరు విద్యుత్ కేంద్రం సివిల్ సెక్షన్‌లో పూజలు నిర్వహించారు. అనంతరం పొల్లూరు విద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సివిల్ ఏఈ పవన్‌కుమార్ దుస్తులు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు. ప్లాంట్‌మేనేజర్ భీమవరపు బాలకృష్ణ. సీనియర్ ఎకౌంటు ఆఫీసర్ వరప్రసాద్. ఏడీలు, ఏఈలు లోయర్ సీలేరు జెన్కో ఉద్యోగస్తులు. కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు

రహదారిపై వైద్యుల ఆందోళన

ఎటపాక, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): భద్రాచలం- కూనవరంరోడ్‌లో నెల్లిపాక ప్రధాన కూడలివద్ద చింతూరు డివిజన్‌లోని పీహెచ్‌సీల్లో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు బుధవారం ఆందోళన నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ హెల్త్ కేర్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ఆందోళన చేపట్టినట్టు వైద్యులు తెలిపారు. జీవో నెం.99రద్దుచేసి డిపార్ట్‌మెంటల్ క్లినికల్ 30శాతం, నాన్‌క్లినికల్ 50శాతం,ఇన్‌సర్వీసెస్ సీట్లు కల్పించడంతో పాటు ఏజెన్సీ పీహెచ్‌ల్లో పనిచేస్తున్న వైద్యులకు 30శాతం బేసిక్ పే అలవెన్స్ కల్పించాలన్నారు.నేటి నుంచి విజయవాడలో రాష్ట్రస్థాం ఆందోళన నిర్వహి స్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో వైద్యులు దేవీనా గ్, ఉదయ్‌కుమార్, నికిల్, షేక్ రెహానా, శ్రీదేవీ, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

ఆదివాసీలను దోచుకుంటున్న గిరిజనేతరులు

● ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి శ్రీను

ఎటపాక, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి):ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల అవసరాలకు డబ్బులిస్తూ, వారి పట్టా భూముల్లో తక్కువ కౌలు రేటు చెల్లిస్తూ మోసం చేస్తున్న నందిగామ గ్రామానికి చెందిన గిరిజనేతర వ్యక్తిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి కుంజా శ్రీను డిమాండ్ చేశారు. బుధవారం కుసుమనపల్లి గ్రామంలో టీపీవీడు సర్పంచ్ మోసం రాజులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనేతర వ్యక్తి ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను తుంగలో తొక్కుతూ ఆదివాసీలకు చెందిన వేల ఎకరాల్లో జామాయిల్ సాగు చేసినట్లు తెలిపారు. జామాయిల్ పంట చేతికొచ్చిన తర్వాత భూమిగల ఆదివాసీ రైతులకు కౌలుచెల్లించకుండానే పంటను తరలిస్తున్నాడని ఆరోపించారు.

ఎన్టీఆర్ భరోసాతో ప్రతిఇంటిలో ఆనందం

ఎటపాక,అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్‌తో ప్రతి ఇల్లు సంతోషంగా ఉండాలన్నదే కూటమిప్రభుత్వ లక్ష్యమని తెలుగు యువత రాష్ట్ర ప్రదాన కార్యదర్శి వల్లభనేని చందు, టీడీపీ సీనియర్ నాయకులు పాటి చలపతి అన్నారు. బుధవారం తోటపల్లి ,ఎటపాక, గన్నవరం, నెల్లిపాక, తదితర గ్రామాల్లో వృద్దులు, దిగ్యాంగులకు పింఛన్ సొమ్మును పంపిణీ చేశారు. ఐటీడీపీ ఇంచార్జ్ శ్రీకాంత్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు

సీఆర్‌పీఎఫ్ సిబ్బంది రక్తదానం

చింతూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): 'స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చింతూరు ఏరియా ఆసుపత్రిలో సీఆర్‌పీఎఫ్ 42 బె టాలియన్ సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ దివాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కోటిరెడ్డి పాల్గొన్నారు.

తక్షణమే బీటీ రోడ్డు పనులు ప్రారంభించాలి

దేవీపట్నం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునునిగుంట నుండి నరసాపురం వరకు తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ వైస్‌ఛైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. ఈ రోడ్డు రాళ్లు లేచి, బూడిదగుట్టలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

మహిషాసురమర్దినిగా దర్శనం



ప్రత్తిపాడు: రాచపల్లిలో అపీత కుచాంబ అమ్మవారు మహిసురమర్దినిగా అలంకరణ, రౌతులపూడిలో మహిషాసురమర్దిని గాదుర్గాదేవి

ప్రత్తిపాడు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు సిరిసంపదలు, శాంతి సౌభాగ్యాలు కలగజేయాలని కనకదుర్గమ్మను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రార్థించారు. స్థానిక బస్టాండ్ వద్ద శ్రీకనకదుర్గ రిక్షా కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి వేడుకల్లో బుధవారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు రిక్షా కార్మిక సంఘం అధ్యక్షుడు మోర్త జాను, ఉపాధ్యక్షుడు మోర్త కొండబాబు, సెక్రటరీ నేదురి రాఘవ, సంయుక్త కార్యదర్శి జట్టా మరియదాసు, కోశాధికారి మోర్త సత్తిబాబు, జెట్టా రాజేంద్ర, మోర్త చల్లయ్య తదితరులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. రిక్షా కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మహిళలు సన్మానించారు. స్థానిక టీడీపీ నాయకులు నియోజకవర్గ సీబీఎన్ ఆర్మీ కో ఆర్డినేటర్ యాళ్ళ జగదీష్, భవాని భక్తులుపత్రి రమణ, గానాల గంగాధర్, స్థానిక టీడీపీ నాయకులు వెలుగుల కొండలరావు (నాని), ముత్యాల రాంబాబు, పోలిశెట్టి శ్రీనివాస్, రావూరి తాతాజీ తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రత్తిపాడు, ధర్మవరం, ఒమ్మంగి, రాచపల్లి, ఏలూరు గ్రామాల్లో కనకదుర్గ అమ్మవారిని మహిసురమర్దినిగా అలంకరించి పూజలు నిర్వహించారు. రాచపల్లి అడ్డ రోడ్డు వద్ద గల అరుణాచల క్షేత్రంలో అపీత కుచాంబ అమ్మవారిని మహిషాసురమర్దిని రూపంలో ఆలయ వ్యవస్థాపకుడు రమణానంద స్వామి ఆధ్వర్యంలో వేదపండితులు అలంకరించి పూజలు నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద నిర్వహించిన భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సత్యప్రభ ప్రారంభించారు.

రౌతులపూడి, (ఆంధ్రజ్యోతి): రౌతులపూడిలో దుర్గాదేవి అమ్మవారు బుధవారం మహిషాసురమర్దినిగా బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్ని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. ఉదయం, సాయంత్రం కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీఅంబికా స్వీట్ స్టాల్ యాజమన్యాం అమ్మవారికి 32కిలోల లడ్డూను అందజేసారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అమ్మవారిని దర్శించుకున్నారు. రౌతుల పూడి దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. వినాయకుడిని సొరకాయలతో అలంకరించగా భక్తులను ఆకట్టుకుంది.

కిర్లంపూడి, (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాలమ్మతల్లికి ఆలయంలో అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆధ్వర్యంలో తొమ్మిదిరోజులు వైభవంగా నవరాత్రులు చేపట్టారు. పద్మనాభం తమ్ముడు సీతాపతిరావు దంపతులు పూజలు చేశారు.భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ముద్రగడ నాయుడు రాజా, ముద్రగడ బుజేంద్ర సత్యంబాబు ప్రసాద వితరణ చేశారు.

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి విరాళం



ఈవో సుబ్బారావుకు విరాళం అందిస్తున్న దాత శ్రీనివాస్

అన్నవరం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి బుధవారం దాతలు విరాళాలు అందించారు. కైకలూరుకు చెందిన కంతేటి శ్రీనివాస్ రూ1,01,116 విరాళాన్ని ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. విశాఖపట్నానికి చెందిన ఎం.ప్రకాష్‌శర్మ రూ.1.01,116 అన్నదాన విభాగాధికారి కంచిబొట్ల రాంబాబుకు అందజేశారు. దాతలను దేవస్థానం అధికారులు అభినందించి, వారికి స్వామివారి ప్రసాదం అందించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



ఏలేశ్వరం,అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): వృద్ధులకు ఆసరాగా పెన్షనర్స్ అసోసియేషన్ సంఘం అండగా ఉంటుందని అధ్యక్షుడు ఉడతా రామచంద్రరావు అన్నారు. బుధవారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని వృద్ధులతో సమావేశం నిర్వహించి 60మంది వృద్ధులకు దుప్పట్లు, భోజన సదుపాయం కల్పించారు. విశ్రాంతి ఉద్యోగులు ఉద్దగిరి సోమరాజు, ఏబీవీ ప్రసాద్, జహీరుద్దీన్, ఇబ్రహీంఖాన్, సాంబశివరావు, స్వర్ణకుమారి, మజ్జి తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

బాలయోగి సేవలు మరువలేనివి: నవీన్



బాలయోగి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జ్యోతుల నవీన్, నాయకులు

జగ్గంపేట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. బాలయోగి జయంతి సందర్భంగా స్థానిక అంబేద్కర్‌నగర్‌లో ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. బాలయోగి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితమవుదా మని నవీన్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, పాండ్రంకి రాంబాబు, దేవరపల్లి మూర్తి, వేములకొండ జోగారావు, పీల మహేష్, రాయి సాయి, సాంబత్తుల చంద్రశేఖర్, తుమ్మల కిషోర్, నండ్ల చిరంజీవి, కొండ్రోతు శ్రీను, నలమాటి ఆనంద్, పలివెల ఏసు రాజు, సందక శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీనియర్ సిటిజన్స్ డే



వృద్ధులకు పండ్లు అందిస్తున్న సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తదితరులు

జగ్గంపేట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్షనర్స్ భవనంలో బుధవారం సంఘ అధ్యక్షుడు తోలేటి సూర్యనారాయణ అధ్యక్షతన పెన్షనర్ల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు మాట్లాడుతూ వృద్ధులైన తల్లిదండ్రులను చూడవలసిన బాధ్యత పిల్లలపై ఉంటుందన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి మంచాల మల్లేశ్వరరావు మాట్లాడారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా పేదలు, వృద్ధులకు దుప్పట్లు, భోజనం ప్యాకెట్స్, ఫ్రూట్స్ సీఐ అందజేశారు. సీనియర్ పెన్షనర్స్ రెడ్డి సుబ్బారాయుడు, డ్రిల్ మాస్టర్ లక్ష్మీనారాయణ, మార్నీడు సత్యనారాయణ, బోడా సోమరాజు, గొట్టుముక్కల పాపరాజు, బురాన్ సాహెబ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ పెన్షనర్లు పడాల వీరవెంకట సత్యనారాయ టణ, మొగలి రామలింగేశ్వరరావు, గోన చక్రరావు, చింతల సత్యనారాయణ, హెచ్‌వీఆర్ జోషి, సీహెచ్ సూర్యప్రకాశరావు, ఇళ్ల బుద్ధాజీ, పసగడుగుల బాబూరావు, వి.గంగాధర్, కొత్త నాగపండు, జి.కుమార్, పెన్షనర్లు పాల్గొన్నారు.



జగ్గంపేటలో జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, టీడీపీ నాయకులు. పక్క చిత్రంలో కత్తిపూడిలో జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

జీఎస్టీపై ప్రజలకు అవగాహన ర్యాలీ

జగ్గంపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో బుధవారం కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జ్యోతుల నవీన్ అధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించేలా ర్యాలి నిర్వహించారు. పట్టణంలోని పలు దుకాణాలకు వెళ్లి అక్కడున్న కస్టమర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పల రాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, పాండ్రంకి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు లాభం

శంఖవరం (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గించడం వల్ల కొనుగోలు శక్తి పెరుగుతుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. బుధవారం కత్తిపూడిలో నూతన జీఎస్టీ విధానాలపై వర్తక సంఘాల నేతలు, వినియోగదారులకు అవగాహన కల్పించారు. ప్రజలకు, వినియోగదారులకు ఆమె కరపత్రాలు పంచారు. అనంతరం పింఛను పంపిణీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్, మార్కెట్ యార్డు ఛైర్మన్ బద్ది మణిరామారావు, వెన్నా శివ, పార్టీ మండల అధ్యక్షుడు ఈగల దేవుళ్ళు, కీర్తి సుభాష్, పోలం చిన్నా, కర్రి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గుదలపై రైతు సేవా కేంద్రాల్లో అవగాహన కల్పించినట్లు కిర్లంపూడి ఏవో సుధామాధురి తెలిపారు. వ్యవసాయ శాఖ కార్యాలయం నుంచి నూకాలమ్మ తల్లి గుడి సెంటర్ వరకు ట్రాక్టర్లు, రైతులతో కలిసి అవగాహన ర్యాలీ జరిపారు.

తగ్గిన వ్యవసాయ పనిముట్ల ధరలు

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడంతో వ్యవసాయ పనిముట్లు, యంత్రాల ధరలు తగ్గినట్లు మండల వ్యవసాయాధికారి జోకా అమృత చెప్పారు. ప్రత్తిపాడులోని రైతు సేవా కేంద్రంలో బుధవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా రైతులతో జీఎస్టీ తగ్గుదల అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎ.బాల సుబ్రహ్మణ్యం, టి.ఉమామహేశ్వరరావు, ఉద్యాన శాఖాధికారిణి కె.దివ్యశ్రీ, వ్యవసాయ విస్తరణ అధికారులు అర్జున్, బలరాం, గ్రామ వ్యవసాయకులు రఘు, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మేలు

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ తగ్గించడంపై పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎంపీడీవో రవి కుమార్‌వర్మ అన్నారు. బుధవారం మండలంలోని లింగంపర్తి గ్రామంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కరపత్రాలను స్థానికులకు అందజేశారు. జీఎస్టీ తగ్గింపుతో రైతులకు కావల్సిన వ్యవసాయ యంత్రాల ధరలు తగ్గుతాయన్నారు.

రావులమ్మతల్లికి నవీన్ పూజలు

జగ్గంపేట, అక్టోబరు 1(ఆంధ్ర జ్యోతి): జగ్గంపేట గ్రామదేవత రావులమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గమ్మ పీఠాన్ని బుధవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ దర్శించుకుని పూజలు జరిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

చండీయాగం

జగ్గంపేట, (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ తనయుడు ఆధ్వర్యంలో జరిగిన చండీయాగంలో జ్యోతుల నవీన్, లక్ష్మీదేవి దంపతులు పీటలపై కూర్చుని యాగం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దుర్గాదేవి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటూ చండీయాగం నిర్వహించామన్నారు. అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టేనని, అమ్మ కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలని ఆశయంతో యాగం నిర్వహించామన్నారు.



చండీయాగం నిర్వహిస్తున్న దృశ్యం



ఆర్థిక సాయం

గండేపల్లి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): గండేపల్లికి చెందిన ఫొటోగ్రాఫర్ భాస్కరుని రంగబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఇది తెలుసుకున్న ఫొటోగ్రాఫర్ల రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు పోసిన వీరేంద్ర(బుజ్జి), సభ్యులు, డాగురె సురక్ష పథకం కింద రూ.58,600, గండేపల్లి ఫొటోగ్రాఫర్లు యూనియన్ రూ.20వేలు కలిపి రూ.78,600 ఆర్థిక సాయాన్ని బుధవారం బాధిత కుటుంబానికి అందించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గండేపల్లి యూనియన్ అధ్యక్షుడు రాంబాబు, సెక్రటరీ కృపావరం, యూనియన్ సభ్యులతో పాటు పలువురు పాల్గొన్నారు.



కిటకిటలాడుతున్న దేవీ ఆలయాలు

ఏలేశ్వరం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవాలు ఆయా గ్రామాల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని జేవిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లింగవరం కాలనీలో శ్రీదుర్గాదేవి అమ్మవారి 15వ నవరాత్రి మహోత్సవములు, దిబ్బలపాలెం సంతోషిమాత ఆలయం, ఆర్టీసీ, నర్సీపట్నం రోడ్డు, లింగంపర్తి, యర్రవరం ఆలయాల వద్ద ఉన్న దుర్గాదేవీ ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు.

ఎమ్మెల్యేకు గిరిజన మహిళల సత్కారం



పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యేను సత్కరిస్తున్న సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజన మహిళలు

ప్రత్తిపాడు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజన మహిళలు బుధవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను ఘనంగా సత్కరించారు. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో నియోజకవర్గంలోని ఉపప్రణాళిక ప్రాంతంలోని 58గిరిజన గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే ప్రస్తావించారు. దీంతో సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజన మహిళలు బుధవారం పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యేకు శాలువాకప్పి సత్కరించారు. 58గిరిజన గ్రామాలను ఐటీడీఏలో కలపాలని, పెదమల్లాపురం కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని తదితర సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేను మహిళలు కోరారు.

ప్రత్తిపాడులో వర్షం

ప్రత్తిపాడు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా బుధవారం మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఆకాశం మేఘావృతమై చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. పలు విడతలు ఓ మోస్తరు వర్షం కురిసింది.

కుళాయి పైప్‌లోకి మురికినీరు

రౌతులపూడి, అక్టోబర్ 1(ఆంధ్రజ్యోతి): రౌతులపూడిలో మార్కెట్ సెంటర్ సమీపంలో ప్రధాన రహదారిలో కుళాయి పైపు లీకైంది. దీంతో పైపులోకి మురికినీరు పోతుంది. ఉదయం, సాయంత్రం కుళాయి వదిలే సమయంలో పైప్ ద్వారా మురికినీరు వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి కావడంతో లారీలు తిరగడంతో పైపులైన్ పగిలి మురికినీరు పోతుంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కుళాయి పైపును సరిచేయాలని కోరుచున్నారు.



మార్కెట్ సెంటర్‌లో లీకవుతున్న కుళాయి



పేదలకు పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

జగ్గంపేట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో పేదల జీవితాలకు భద్రత లభిస్తుందన్నారు. బుధవారం జగ్గంపేట అంబేడ్కర్ నగర్‌లో జరిగిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, పాండ్రంకి రాంబాబు, దేవరపల్లి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

గండేపల్లి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగారంపాలెం గ్రామంలో బుధవారం జరిగిన పింఛన్ల పంపిణీలో కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల మోహనరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బందితో ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అక్కిల సుదర్శన్‌రావు, నాగేశ్వరరావు, బుల్లిదొర, ఎన్.కొండ, బాబ్జి, శ్రీరామ్ తదితరులు ఉన్నారు. యల్లమిల్లి గ్రామంలో టీడీపీ అధ్యక్షుడు సుంకవిల్లి వీరవెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం పింఛన్లను పంపిణీ చేశారు.

పింఛన్‌దారుల్లో వెలుగులు నింపిన ప్రభుత్వం

ఖాదీ బోర్డు డైరెక్టర్ కన్నబాబు



పింఛన్ అందజేస్తున్న కన్నబాబు

ప్రత్తిపాడు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పేరుతో కూటమి ప్రభుత్వం పింఛన్‌దారుల్లో వెలుగులు నింపిందని రాష్ట్ర ఖాదీ బోర్డు డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు చెప్పారు. ప్రత్తిపాడులో బుధవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ఆయన నిర్వహించారు. చినశంకర్లపూడిలో మండల పరిషత్ మాజీ ప్రతిపక్ష నాయకుడు మిరియాల శ్రీను, కూటమి నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మదినే దొరబాబు, పోలిశెట్టి శ్రీనివాస్, రావూరి తాతాజీ, మదినే స్వామి, చినశంకర్లపూడిలో వార్డు మెంబర్ దుర్గ, జేఏబీసీ కస్తూరి తేజ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ

ప్రత్తిపాడు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒమ్మంగి శరభవరం గ్రామాల మధ్య బుధవారం ఆర్టీసీ బస్సు.ఆటో ఢీకున్నాయి. ప్రత్తిపాడు నుంచి శాంతి ఆశ్రమం వెళుతున్న ఆర్టీసీ బస్సు శరభరం నుంచి ఒమ్మంగ్ వైపు వస్తున్న ఆటో లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలోని ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆర్టీసీ బస్సు, ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించి స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు